ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్ చెరువులో ఉన్న గంగమ్మ తల్లి దేవాలయం పూర్తిగా శిథిలావస్థలోకి చేరిందని, ఎమ్మెల్యే, కార్పొరేటర్ చొరవ చూపి ఆలయ పునర్నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు బిక్షపతి కోరారు. బుధవారం గంగపుత్ర సంఘం ప్రతినిధులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జనార్దన్, శివకుమార్, రాజు, యాదగిరి, పెంటయ్య, లక్ష్మణ్, ఎం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ నేత బొల్లేపల్లి సీతారామరాజు నిజాంపేట చౌరస్తా బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉద్భవ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం

మోతీనగర్: సత్యసాయి సేవ సమితి, వెంగళరావు నగర్ సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం మోతీనగర్ కమిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సమితి కన్వీనర్ చంద్రశేఖర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం 5 నుంచి 6 గంటల వరకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 9 నుంచి 10 గంటల వరకు ఆదర్శ అనాథాశ్రమం నందు పాదరక్షల పంపిణీ, 11 నుంచి 11.30 గంటల వరకు సత్యసాయి అష్టోత్తర పారాయణం, 11.30 నుంచి 1.30 వరకు మహా నారాయణ సేవ, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు రుద్ర పారాయణ భజన, మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి భక్తులు, బాబా శిష్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: జమ్ము కాశ్మీర్‌లో అత్యంత భయంకరంగా దాడుల జరిపి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నందుకు నిరసనగా బుధవారం టెర్రరిస్టుల దిష్టిబొమ్మను నిజాంపేట చౌరస్తాలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మతం కనుక్కొని కాల్చి చంపటం పిరికిపందల చర్య అని అన్నారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సురభి రవీందర్‌రావు, రామరాజు, కేశవులు, మణిభూషణ్, నర్సింగ్‌యాదవ్, నాగులు గౌడ్, నరసింహాచారి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన..

కూకట్‌పల్లి: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా 5వ ఫేజ్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడులో 28 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్, సాగర్, ముమ్మారెడ్డి ప్రేమకుమార్, కొల్లా శంకర్, వెంకటేశ్వరరావు, ఎస్. నాగేంద్ర, వేముల మహేష్, ప్రసాద్, శ్రీనివాస్, సూర్యమోహన్, నవీన్, క్రాంతి, శంకర్‌రావు, అనిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అర్ధరాత్రి మంటలు



మోతీనగర్: మూసాపేట డివిజన్‌మోతీనగర్ మీ సేవా సమీపంలో ఖాళీ ప్రదేశంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో సమీప నివాసితులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు రావడంతో ఇళ్లలో నివసించే వారు ఆరుబయటకు వచ్చి బిక్కు బిక్కుమంటూ గడిపారు. స్థానికులు సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రెండు గంటల పాటు మంటలు వచ్చాయి. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో చెత్తాచెదారం వేయడంతో జరిగిందా?, ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా? అనేది తెలియాల్సి ఉంది. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగక పోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వసూళ్లపై తగ్గిన ఆసక్తి!

శివారు పురపాలికల్లో పన్నుల టార్గెట్ రూ.353.66 కోట్లు

- 13 పట్టణాల్లో వసూలైంది రూ.262.92 కోట్లు
- పేరుకుపోయిన బకాయిలు రూ.90.73 కోట్లు
- 21 రోజుల్లో రూ.49.53 కోట్ల రాబడి



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి,సిటీబ్యూరో: పట్టణాభివృద్ధితో సహా సిబ్బంది జీత భత్యాలు, తాగునీటి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పాటును ఇస్తున్న వివిధ రకాల పన్నుల వసూళ్లపై పుర యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకే నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా పన్నుల వసూళ్లపై దృష్టి సారించాల్సిన పుర కమిషనర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

- నగర శివారు 13 పురపాలిక సంఘాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల రూపేణా రూ.353.66 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, ఇప్పటి వరకు రూ.262.92 కోట్లు మాత్రమే వసూలు చేయకలిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసి, దాదాపు నెల కావస్తున్నప్పటికీ, గతేడాది పన్నుల బకాయిలు రూ.90.73 కోట్లు పేరుకపోవడంపై జిల్లా అధికార యంత్రాంగం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.
- రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించే వారికి 5 శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 13.73 శాతం పన్నులు అంటే రూ.49.53 కోట్లు ప్రజలు నేరుగా చెల్లించడంపై అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరు వరకు 5 శాతం రాయితీ వర్తింపు ఉండటంతో ప్రజల నుంచి పన్నుల చెల్లింపులు అంచనా మించగలవన్న ఆశాభావాన్ని వెల్లడిస్తున్నాయి.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

- నగర శివారు మేడ్చల్. మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా.. ఈ పట్టణాల్లో ఇంటి పన్నుతో సహా వివిధ పన్నుల రూపేణా వసూలయ్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లు బోడుప్పల్‌లో రూ.32.51 కోట్లకు రూ.21.18 కోట్లు (65.15 శాతం) వసూలు కాగా.. పీర్జాదిగూడలో రూ.35.17 కోట్లకు రూ.31.99 కోట్లు (90.90 శాతం) పన్నులు, జవహర్‌నగర్‌లో రూ.14.64 కోట్లకు రూ.9.03 కోట్లు (61.68 శాతం), నిజాంపేట్‌లో రూ.75.21 కోట్లకు రూ.55.22 కోట్లు (73.42 శాతం) పన్నులు వసూలయ్యాయి. మున్సిపాలిటీలు పోచారంలో రూ.26.38 కోట్లకు రూ.19.49 కోట్లు (73.86 శాతం) పన్నులు వసూలు కాగా.. తూముకుంటలో రూ.17.20 కోట్లకు రూ.13.90 కోట్లు (80.79 శాతం), నాగారంలో రూ.23.62 కోట్లకు రూ.18.94కోట్లు (80.18శాతం), మేడ్చల్‌లో రూ.15.87 కోట్లకు, రూ.11.71 కోట్లు (73.77శాతం), కొంపెల్లిలో రూ.16.01 కోట్లకు, రూ.12.64 కోట్లు (78.98శాతం), ఘట్కేసర్‌లో రూ.12.26 కోట్లకు, రూ.7.59 కోట్లు (61.95శాతం), గుండ్లపోచంపల్లిలో రూ.17.26కోట్లకు, రూ.14.82 కోట్లు (85.91శాతం), దమ్మాయిగూడలో రూ.23.20 కోట్లకు,రూ.13.69 కోట్లు (59శాతం), దుండిగల్ మున్సిపాలిటీలో రూ.44.26 కోట్లకు, రూ.32.67 కోట్లు (73.82శాతం) పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో మొత్తంగా రూ.353.66 కోట్లకు రూ. 262.92 కోట్లు (74.34 శాతం) వసూలయ్యాయి.

పన్ను చెల్లించి.. రాయితీ పొందండి



ఈ ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించి ఆస్తిపన్నుతో సహా ఇతర పన్నులు ఏప్రిల్ 30 లోగా చెల్లిస్తే, 5 శాతం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలి. లేదంటే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటోంది. పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– రాధికాగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్

పన్ను చెల్లింపుపై రాయితీతో రూ.49.53 కోట్లు

13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం 5 శాతం రాయితీ ప్రకటించింది. ఈనెల 30 వరకు ఆస్తిపన్నుతో సహా వివిధ పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని పుర యంత్రాంగం కల్పించింది. ఈ నేపథ్యంలో 21 రోజుల్లో 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.49.53 కోట్లు (13.73శాతం) వసూలైంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని పురపాలక యంత్రాంగం కోరుతోంది.


బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీలో బుధవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు. – కూకట్‌పల్లి

కొనసాగుతున్న 'డిజైన్ సింక్'



రాయదుర్గం: రాయదుర్గం ఎఫ్‌డీడీఐలో కొనసాగుతున్న 'డిజైన్‌సింక్' ప్రదర్శనలో భాగంగా మూడవరోజు బుధవారం కొల్హాపురి చెప్పుల తయారీని విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రశ్నలు అడిగారు. కొల్హాపురి చెప్పుల తయారీలో 45 ఏళ్ల అనుభవం ఉన్న జియాగూడ, ఇందిరానగర్ వాసి కమల్‌శెట్టి యాదిలాల్ మాట్లాడుతూ గంట సమయంలో చెప్పులు తయారు చేస్తానని తెలిపారు. రూ.180 నుంచి రూ.300 వరకు వాటి నాణ్యతను బట్టి ధర ఉంటుందన్నారు. అనంతరం పిడిలైట్ ఇండస్ట్రీస్ సీనియర్ మేనేజర్ రవీంద్రమోరే మాట్లాడుతూ డిజైన్ రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఏ రంగంలోనైనా నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొల్హాపురి చెప్పులను తయారు చేస్తున్న కమల్ శెట్టి యాదిలాల్, తిలకిస్తున్న విద్యార్థులు

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బైక్ ర్యాలీ



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు తమ నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15 ఏళ్లకు పైగా సేవలందించినా ఇంకా రెగ్యులర్ చేయకపోవటం తీవ్ర నిరాశకు గురి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యని పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.


బాలానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందించిన మండల విద్యాధికారి హరిచందర్, ఉపాధ్యాయులు తదితరులు – బాలానగర్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

– కార్పొరేటర్ సబిహా బేగం


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో అన్ని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



రాయదుర్గం: జమ్ముకశ్మీర్ పహల్గావ్‌లో ఉగ్రదాడులకు నిరసనగా బుధవారం రాత్రి రాయదుర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. పెద్ద సంఖ్యలో యువత, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణానికి సీల్ తొలగింపు.. కేసు నమోదు

మోతీనగర్: అక్రమ నిర్మాణానికి వేసిన సీల్‌ను తొలగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ అధికారులు సీలు వేశారు. ఆ సీలును తొలగించినందుకు మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా కదలాలి

– ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కార్పొరేటర్‌లతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా కదిలేలా బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కార్పొరేటర్‌లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో మంది నిరుపేదలు పథకాలు ద్వారా లబ్ధి పొందారో, రైతులకు జరిగిన మేలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీరు, భోజన సదుపాయాన్ని నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి చూసుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల మంచినీటి సదుపాయానికి ఇబ్బందులు రావద్దన్నారు. ఎటువంటి ఇబ్బంది ఉన్నా తనకు ఫోన్ చేయాలన్నారు. పది ఏళ్లుగా ఎంతో అభివృద్ధి చేసుకున్న రాష్ట్రం నేడు దివాలా తీస్తుందన్నారు. చెరువులు ఎండి భూగర్భ జలాలు అడుగంటి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ఉగ్రదాడి అమానుషం

ఉగ్రదాడిలో అమాయక ప్రజలను చంపటం అమానవీయ చర్య అని, ఈ సంఘటన తనకు చాలా బాధ కలిగించిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటువంటి వారిని క్షమించకూడదని భారతదేశ ప్రతిష్ఠను దిగజార్చడానికి ఉగ్రవాదులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దాడులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలని అన్నారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల సేవకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు.

చెరువు కట్ట చుట్టూ రిటర్నింగ్ వాల్


రిటర్నింగ్ వాల్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కట్ట చుట్టూ రిటరినింగ్ వాల్ ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని హస్మత్‌పేటలోని హిందు శ్మశాన వాటికలో రూ. కోటి, క్రిస్టియన్ శ్మశాన వాటికలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు, బోయిన్ చెరువుకు రూ.కోటి నిధులతో రిటర్నింగ్ వాల్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటికల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. బోయిన్ చెరువు అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం మరో కోటి నిధులు కేటాయించి చెరువు కట్టపైకి వాహనాల రాకపోకలు లేకుండా ఉండేందుకు కట్ట చుట్టూ రిటర్నింగ్ వాల్‌తో పాటు కట్టకు అటు ఇటు గేట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు స్టేషన్‌కు అటాచ్ చేస్తామని తెలిపారు. చెరువు కట్టపై అక్రమ పార్కింగ్ వాహనాలను తొలగింపజేస్తామన్నారు. ఎఫ్‌టీఎల్‌లో భవనాల నిర్మాణం చేపట్టినవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెప్పారు. పనులు పూర్తి అయితే చెరువు కట్టపైకి వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, పోచయ్య, రాజుగౌడ్, పెంటయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులను పూర్తి చేస్తాం

–పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పెండింగ్‌లో ఉన్న బీటీ, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ మెడికల్ సొసైటీ, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద బీటీ, సీసీ రోడ్డు పనులకు రూ. 1.06 కోట్ల వ్యయంతో కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎక్కడ రోడ్లు దెబ్బతిన్నాయో అవన్నీ జీహెచ్‌ఎంసీ నిధులతో మంజూరు చేయించటం జరిగిందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఆంజనేయులు, బాబు, మోహన్‌రావు, జగదీష్‌గౌడ్, శ్రీనివాస్, జై, అఖిల్, వివేకానందనగర్ కాలనీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, మెడికల్ సొసైటీ ప్రెసిడెంట్ జీపీ రెడ్డి, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ సెక్రటరీ సంతోష్‌రావు, భగవాన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కీ బోర్డ్ ప్లేయింగ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు


అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలో నివాసం ఉండే మేడిది లలిత కుమారి, తన ఇద్దరు కుమార్తెలు మేడిది లేషాప్రజ్ఞ (8), మేడిది అభిజ్ఞ(5)లతో కలిసి గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి చిన్న వయస్సులో ఈ రికార్డు నెలకొల్పడం, అది కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన చిన్నారులు కావటం ఎంతో సంతోషకరమన్నారు. 18 దేశాలకు చెందిన కీబోర్డు సంగీత కళాకారులు పాల్గొన్న కార్యక్రమంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అరుదైన రికార్డు సాధించటం అభినందనీయమన్నారు. డిసెంబర్ 1, 2024న గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డ్స్ సృష్టించడానికి హోలీ మ్యూజిక్స్ స్కూల్ విద్యార్థులతో కలిసి గంట వ్యవధిలో ఇన్‌స్టాగామ్ వేదికగా వీడియోలు అప్‌లోడ్ చేయగా.. లండన్‌లోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధినేత మిస్టర్ రిచర్డ్ స్టన్నింగ్ సంగీత కళాకారులను విజేతలుగా ప్రకటించి డిసెంబర్ 9, 2024న లండన్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా వారిని అభినందించారు. ఏప్రిల్ 14, 2025న హైదరాబాద్‌లోని మణికొండలో జరిగిన వేడుకల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్, హోలీ మ్యూజిక్స్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టిన్ దండంగి సర్టిఫికెట్, పతకాలు అందజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మూసాపేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రేణుక అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా జనతానగర్‌లోని వడ్డెర బస్తీ 2 సెంటర్‌లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, కృష్ణ ప్రియ, సూపర్ వైజర్, మెడికల్ ఆఫీసర్ మౌనిక, ఏఎన్‌ఎం సిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462